నలభై యేళ్ళ పురుషుడు తలుపు తెరచి "ఏమండీ?" అని చాలా దీనంగా అడిగాడు.

"వెంకట్రామయ్యగారు మీరేనా?"

"అవునండి."

"రెండు రోజులనుంచి మీ అమ్మాయి పత్రికకోసం రావడం లేదండి."

వెంకట్రామయ్య రెండు చేతులతోటి మొహం కప్పుకొని, "ఇంక రాదండి" అనేశాడు.

న్యూస్ ఏజెంటుకు గుండె గతుక్కుమన్నది.

"ఏం?" అన్నాడు నిర్ఘాంతపడి.

"దేవుడు తీసుకుపోయాడు" అనేశాడు, ఆ అమ్మాయి తండ్రి.

"అయ్యో!" అని నిలువునా నీరైపోయాడు న్యూస్ ఏజెంటు. అతని కళ్ళముందు ఏమేమి దృశ్యాలు తిరిగాయో, కన్నీటి చుక్కలు నేలవ్రాలాయి.

"అయ్యో!" అనుకుంటూ, వచ్చినదారినే ఇంటికి చేరాడు.

ఆనాటికీ, ఈనాటికీ ఆ సంక్రాంతి సంచిక అలాగే వుంది. దానిని చూసినప్పుడల్లా న్యూస్ యేజెంటు మొహం బిక్కపోతూ వుంటుంది.

---

# 11. ఇంటి అద్దె

శేఖరరావు కథలు వ్రాస్తాడు. మదరాసుకు రాకపూర్వం అతని కథలు కొన్ని పత్రికలలో అచ్చు పడ్డాయి. ఒకరిద్దరు సంపాదకులు అతని కథలను మెచ్చుకుంటూ ఉత్తరాలు వ్రాశారు కూడాను. అంచేత అతను ఉద్యోగ ప్రయత్నాలు విరమించి, కథలు వ్రాసుకొని జీవిద్దామనీ, అవ

కాశంవుంటే ఏదయినా పత్రికలో పనిచేద్దామనీ మదరాసుకు వచ్చేశాడు. వచ్చిన తరువాత పదిహేను రోజులదాకా, యూనివర్శిటీ క్లబ్బులో తన మేనల్లుడికి అతిథిగా గడిపాడు.

శేఖరరావు, వస్తూ తన వెంట తెచ్చుకొన్నవి నూరురూపాయలు. యూనివర్శిటీ క్లబ్బులోవున్న పదిహేను రోజులలోనూ దర్జాకోసం, తక్కిన వాళ్ళతో సినిమాలకీ, హోటళ్ళకి తిరిగి పాతిక రూపాయలు ఖర్చు పెట్టేశాడు. ఆ పదిహేను రోజులలోనూ ఏదేనా ఒక కథ వ్రాయడానికిగూడా తెరపిలేక పోయింది. అంచేత వేరే చిన్నగది యెక్కడైనా తీసుకొని వుందామని నిశ్చయించుకున్నాడు. తన దగ్గర వున్న డెబ్బయ్యయిదు రూపాయలతోనూ మూడు నెలలు గడిపితే ఈ లోపల తాను వ్రాసే కథలమీద ఏమైనా వస్తుంది. మరి కొన్నాళ్లు గడపవచ్చు. అదీ అతని ఊహ. ఆ ప్రకారం లెక్కవేసి చూస్తే, యింటి అద్దెక్రింద అతను ఖర్చుపెట్ట గలిగింది నెలకు నాలుగు రూపాయలే కనపడుతున్నాయి. అలాటి అద్దెకు తనకు గది దొరుకుతుందేమోనని ట్రిప్లికేన్, మైలాపూర్, ఎగ్మూర్, మాంబళం మొదలైన ప్రాంతాలన్నీ వెతికి చూశాడు. లాభం లేకపోయింది. చింతాద్రిపేటలో అద్దెలు కొంచెం తక్కువ అని తెలుసుకొని, చింతాద్రిపేట అంతా గాలించాడు. చిట్ట చివరకు అతని అదృష్టం ఫలించి నట్లయింది.

ఒక మొదలియారుల ఇంట్లో ఓ మోస్తరు గది, నాలుగు రూపాయలకు ఇస్తా మన్నారు. ఆ యింటి యజమాని, వచ్చీరాని తెలుగుభాషలో శేఖరరావుతో చాలా ఆదరణ పూర్వకంగా మాట్లాడాడు. కష్ట సుఖాలను కనిపెట్టే యజమానితో వుండటం మంచిదని, శేఖరరావు మర్నాడు ఉదయమే తన సామానంతా తెచ్చుకొని ఆ గదిలో ప్రవేశించాడు. శేఖరరావు వాడుకోడానికి రెండు కుర్చీలనూ, ఒక టేబిలునూ, ఇంటి యజమాని ఆ గదిలో వుంచాడు. శేఖరరావు ఈ యేర్పాటుకు చాలా సంతోషించాడు. అమర్చివున్న కుర్చీ, బల్లలను చూసేటప్పటికి, కథ వ్రాయాలనే వుత్సాహం కూడా అతనికి ఎక్కువ అయింది. కలంలో సిరా అయిపోవడమూ, తెల్లకాగితాలు దగ్గర లేక పోవడమూ చూసి, మధ్యాహ్నం జార్జిటౌను వెళ్ళి కావలసిన వస్తువు

లను కొనుక్కొవి, నిశ్శబ్దతతో నిండిన రాత్రిపూట కథ వ్రాయాలని నిశ్చయించుకున్నాడు.

ఆ రాత్రి హోటలకు వెళ్ళి భోంచేసి, గదికి వచ్చేటప్పటికి తొమ్మిదిన్నర అయింది. ఎలక్ట్రిక్ లైట్ వేసుకొని, కథ వ్రాయడానికి కూచున్నాడు శేఖరావు. కథ ప్రారంభమైంది, ఇలా:

"ఆ అమ్మాయికి, పాపం, చదువురాదు."

పై ఒక్క వాక్యం వ్రాశాడో లేదో, శేఖరరావు గదికి ప్రక్క నుంచి, అతి దారుణమైన మూలుగు వచ్చింది.

నవనాడులూ క్రుంగిపోయి, కలం ముందుకు సాగక, మెదడు స్తబ్ధత్వంపొంది కుర్చీకి అతుక్కు పోయాడు శేఖరరావు.

మళ్ళీ కొంచెం సేపటికి, అదే మూలుగు.

శేఖరరావు స్థితిలో మార్పు ఏమీ రాలేదు.

చెవులు రిక్కించి, ప్రక్కగదిలో శబ్దాన్ని వింటున్నాడు.

మళ్ళీ మూలుగు; ఆ మూలుగుతోపాటు కుక్క మొరిగిన ధ్వని. కొంచెం సేపటికి అతనికి, అ మూలుగుకూడా, కుక్క మూలుగేనని అర్థమయింది.

మొరగడం ఆరంభించిన కుక్క, మూలుగుడు కట్టిపెట్టే సింది. నాలు గైదు నిమిషాలు వరసగా మొరిగింది కుక్క. తరువాత నిశ్శబ్దం.

ప్రశాంతత నెలకొన్నది గదా, మళ్ళీ కథను సాగిద్దామని శేఖర రావు కలం తీసుకున్నాడు.

కుక్క మొరుగుడు ప్రారంభమైంది. కొంతసేపటికి అతని ప్రాణం విసుగెత్తింది. ఆ నాటికి ఇహ కథ వ్రాయడం పడదని నిశ్చ యించుకుని, ప్రక్కమీదకు వొరిగాడు. కాని, పక్కగదిలో ఉన్న కుక్క, ఇతన్ని నిద్ర పోనిస్తేగా!

ఆ గది ఖాళీచేసి, మర్నాడే వెళ్ళిపోదామని శేఖరరావు నిశ్చ యించుకున్నాడు.

మర్నాడు చాలా ప్రొద్దెక్కిన తరువాత నిద్ర లేచి, రాత్రి తానుపడ్డ అవస్థనంతా ఇంటియజమానికి చెప్పాడు.

ఇంటి యజమాని ఫకాలున నవ్వి "ఆంధ్రావాళ్లు ఇంతదా, సార్. కుక్క శబ్దం చేస్తే, నీకు ఎందుకుసార్ బయం. దానిమాల అది ఉంది. నీపని నువ్వు చేసుకో. దాని గోలదా నీకు ఎంతుకు? మేము వుండామా లేదా. మేము నిద్రపోలేదా. నిండా భేషుగా నిద్రపోతిమే. నీకుదా వచ్చిందా, వమ్మ! ఏమిసార్, చెప్తావు. ఇంట్లో బిడ్డకోసం తెస్తిమి దాన్ని. బిడ్డ, దాన్ని విడవనంటాడు. బిడ్డను ఏడిపిస్తుమా! ఏమిసార్, నువుదా చెప్పుమీ! ఒక కుక్క అరిస్తే, నీకు ఎంతుకు లెక్క? అదిదా బుద్ధిలేని జంతు. అదంతా నీకు ఎందుకుమీ! ఏమిసార్, నువ్వువట్టి చిన్న పిల్లకాయలాగ ఉండావె. కుక్కదా అరుస్తుంది. మనుష్యాళు అరుస్తామా! నీకు ఏల సార్? నీ పనిగా నువ్వు ఉండుమీ- అది అరిచినాను నీకు వినపడదే. మీ ఆంధ్రావాడు అంతదా సార్. కుక్క అరిచింది, పిల్లి అరించింది అంటాడు. ఎన్న, కుక్క అరవదా? పొండి, ఒటేల్‌కి పోయి సాపడిరాండిమీ. కుక్క సంగతే మీకు వద్దు; మీ పనిగా మీరు ఉండండి" అని ఒక చిన్న లెక్చరు, శేఖరరావు మళ్ళీ నోరెత్తకుండా, కొట్టేశాడు. ఇల్లు ఖాళీచెయ్యడానికి శేఖరరావుకు నమస్కరించ లేదు.

పగలు కుక్క అరుపే వినపడలేదు. శేఖరరావు మధ్యాహ్నం పూట కూచుని సగం కథ వ్రాశాడు.

మళ్ళీ రాత్రి అదే తంతు. కుక్క మొరగడం ప్రారంభమైంది. శేఖరరావు శ్రద్ధగా ఆలకించాడు.

కుక్క అరుపు విని, విని, విసుగుపుట్టి "బౌ" అని అతడు అరిచాడు. పక్కగదిలో ఉన్న కుక్క అతని అరుపును ఆలకించింది

మళ్ళీ అరిచింది. అతడు అరిచాడు. ఒక గంటసేపు కుక్కా, దానికి బదులుగా శేఖరరావూ మొరుగుతూ కూచున్నారు.

చివరకు నిద్రవచ్చి అతడు పడుకున్నాడు. ఆ మర్నాడు ఇంటి యజమాని, శేఖరరావును పరామర్శించాడు-

"ఏమిసార్, రాత్రి నిండా బాగా తూకం రాలేదా?" అని.

శేఖరరావు జవాబు చెప్పకుండా, చిరునవ్వు నవ్వి, వూరుకున్నాడు.

ఆ నాటిరాత్రి మళ్ళీ అలాగే జరిగింది.

"అనగ ననగ రాగ మతిశయిల్లు" గదా! మొరగ, మొరగ, శేఖరరావుకు, కుక్క అరుపు చక్కగా పట్టుబడి పోయింది.

కుక్క మొరుగుళ్ల మధ్యనూ, తన మొరుగుళ్ళ మధ్యనూ, పది రోజులలో శేఖరరావు రెండు కథలు పూర్తిచేశాడు.

మూడో కథ ప్రారంభించాడు; సగం అయింది.

ఒకనాటి రాత్రి, వ్రాతకు కూచున్నాడు. యథాప్రకారంగా లేదు. ఏదో లోటు కనిపించింది. ఏమిట్రా అని ఆలోచించాడు.

ఏముంది? పక్కగదిలోనుంచి కుక్క మొరుగుడు వినరాలేదు. అతని ప్రాణం చివుక్కుమన్నది. ఎంచేతనో! అలవాటుపడిన ఆ మొరుగుడు వినపడక పోయేటప్పటికి, అతనికి ఏమీ తోచలేదు. దిగులు పుట్టింది. నిద్రపట్టలేదు.

మర్నాడు ప్రొద్దునే యింటి యజమాని దగ్గరకు వెళ్లాడు. గ్రుక్క తిరగకుండా ఏడుస్తున్న కొడుకును సముదాయించలేక యింటి యజమాని సతమత మవుతున్నాడు.

"కుక్క ఏమయిందండీ?" అని అడిగాడు శేఖరరావు.

మొదలియార్ కళ్ళు నీళ్ళు క్రమ్మాయి. "శత్తు పూడుదు సార్. నిన్నదా నీకు సెప్పాలని ఉంటిని. బిడ్డ ఏడ్చేదానికే అంతులేదు. చూడుమీ, ఎట్లా ఏడుస్తాడో! ఇదంతా కుక్క కొరకుదా. నిన్న మధ్యాన్నం కారుకింద పడి శత్తు పూడుదు సార్. ఈ బిడ్డను ఎట్టాదా సంబాళించేదీ అనేదే నాకు తెలవరాదు సార్. అయ్యో, ఏమిసార్, చేస్తాము" అని విలపిస్తున్నాడు మొదలియార్. అతని చేతిలోవున్న కుర్రాడు గింజుకుని ఏడుస్తున్నాడు.

శేఖరరావుకూ దుఃఖం వచ్చింది. కుక్కను తలచుకుంటూ, తనకు తెలియకుండానే, హఠాత్తుగా "బౌ" అని మొరిగాడు.

చిత్రం! చంటిపిల్లాడు ఏడ్పు మానివేశాడు. మొదలియార్ నిర్ఘాంత పోయాడు. "ఎవరు సార్, అది" అని ఆశ్చర్యంతో అడిగాడు.

ఆ కుక్క మొరుగు, మొరిగినది తనేనని సిగ్గుపడుతూ ఒప్పు

కొన్నాడు శేఖరరావు. మొదలియార్‌కు చెప్పరాని సంతోషం కలిగింది.

"మళ్ళీ వొక్కసారి అనుమీ, సార్. బిడ్డకు ప్రాణం వస్తుంది సార్, నీకుదా పుణ్యం సార్" అని ప్రార్థించాడు మొదలియార్.

శేఖరరావు మళ్ళీ మొరిగాడు. కుర్రాడు ఆనందంతో కేరింతాలు కొట్టాడు. మొదలియార్‌కు ఆనంద బాష్పాలు రాలాయి. ఇంట్లో ఎక్కడో పనిచేసుకుంటున్న మొదలియార్ భార్య వచ్చి, ప్రాన్పడి నిలుచుండి పోయింది. పిల్లవాడిని సంతోషపెట్టి, తాను, తన పక్క గదిలో నేస్తాన్ని కోల్పోయినందుకు దుఃఖపడుతూ హోటల్‌కు వెళ్లాడు శేఖరరావు.

ఆనాటి రాత్రి, శేఖరరావు దిగులుతో ఏమీ తోచక కూర్చుని వుండగా మొదలియార్ వచ్చాడు అతని గదిలోకి.

"ఏమండీ?" అని ప్రశ్నించాడు శేఖరరావు.

"ఒన్నులేదు సార్. నేడుదా, మా ఆండవాళ్లు మీ సంగతి నాతో చెప్పిరి. మీరు దినాము పచ్చి నీళ్లుదా స్తానం చేస్తారు. అది వొంటికి జబ్బు. దినాము మా ఆండవాళ్ళు కాచి ఇస్తారు, వేన్నీళ్లుదా స్తానం చెయ్యండి సార్" అన్నాడు మొదలియార్. ఈ అవ్యాజ ప్రేమ శేఖరరావుకు అర్థంకాలేదు. "ఎందుకండీ, పాపం, మీ ఆడవాళ్ళకు శ్రమ" అన్నాడు.

"అదంతా యేమిలేదు సార్. నేను చెప్పిందిదా నువ్వుచెయ్యిమీ. నీకు ఎవరు సార్ ఇక్కడ? అమ్మ. అబ్బ, ఎక్కడనో ఉంటుంది. ఆంధ్రావాళ్ళ అంతదా సార్. పనికోసం, ఒంటిగా వస్తురు. కష్టపడు దురు. నీకు ఏమీ! వెన్నీరు పోసుకోమీ. బాగా ఉంటావు.

"అందుకు మేలె, ఇంకొక సమాచారం. నువ్వు, నాకు బాడుగ ఇవ్వనేవలదు. నువ్వు నాలుగు రూపా ఇస్తే, నాకు ఏమి, ఇవ్వకపోతే ఏమి? నీ దుడ్డు ఏల నాకు? నాకుదా, కళవళు ఇచ్చివుండాడు తినేదానికి. ఎట్లనో చూస్తాము. నీ బాడుగ నాకు ఏల? నువ్వుదా, మంచివాడు. ఆంధ్రావాళ్ళు అందరునూ అంతదా. తాము కష్టపడుతురేగాని, ఇన్నోరు ఆళును కష్టపెట్టేదే లేదు. నీ దుడ్డు వద్దు సార్. నీ సొంత వీడుమాదిరి ఉండు మీ....

"ఏమిసార్. బిడ్డదా నాకు పెద్దకష్టం ఇప్పుడు. ఆ శబ్దం వినా లంటాడు. అప్పుడప్పుడు, అ శబ్దం వింటే బిడ్డకు బాగ ఉండును. బిడ్డకు బాగ ఉంటే, ఇంట్లో ఆండవాళ్ళకు బాగ ఉండును. నాకునూ బాగ ఉండును. నీకుదా ఆ శబ్దం బాగ పలుకుతాది. ఎక్కడ సార్, నీకు వచ్చింది, అదీ.నాకు రానంటుందే. అదియుం, ఒక పెరియ ఇదిదా సార్. అందరికి వస్తునా, ఏమి సార్? నువ్వుదా మంచి తెలివిగలవాడు. నీకుదా అది వస్తుంది. నాకు వస్తాదా! ఏల వస్తుంది?

"వచ్చిన విద్య పోరాదు సార్. అంటూనే ఉండవలె. చిన్న బిడ్డకు దినాము, నాలు, అంజిసార్లు, అది వినపెట్టితే, బిడ్డ బాగవుండును సార్. లేదా, బిడ్డకూడ నష్టమై పూడ్చును సార్. నువ్వుదా, మంచి వాడు. నీకు నేను చెపుతునా! ఇక్కడనే సౌక్యంగ ఉండుమీ. నీ సొంత వీడుదా ఇది. నీ తంబి ఏడిస్తే, అట్లా అరుస్తువాలేదా సార్! అంతదా. నువ్వు ఇక్కడనే ఉండి, బిడ్డను కాపాడబోతావు అనిదా నేను ఆండవాళ్ళకు చెపితిని. ఉండుమీ సార్........

"ఇంకా బిడ్డ పండనేదు. ఒక్కసారి ఆ శబ్దం అనుమీ సార్" అని ముగించాడు, మొదలియార్.

"బా" అని మొరిగాడు పాపం, శేఖరరావు.

---

# 12. సగం మంది

ఊరంతా అట్టుడికినట్టు ఉడికిపోతోంది. ఎవరినోట చూసినా, ఆ పత్రికను గురించిన మాటలే. ఇంతకూ సంగతి ఏమంటే, ఆ పత్రికా సంపాదకుడు, ఆ వారపు సంపాదకీయంలో "ఈ పూరి మ్యునిసిపల్ కౌన్సిలు సభ్యులలో సగంమంది శుంఠలు" అని రాశాడు. దానితో